క్లుప్తంగా

వాహనాల నిలిపివేతతో ప్రమాదాలు..!



దంతాలపల్లి: మండల కేంద్రంలోని వరంగల్-ఖమ్మం జాతీయ రాహదారిపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భారీ వాహనాలను మండల కేంద్రంలో రోడ్డుపై నిలుపుతున్నారు. దీంతో వాహనదారులకు పాదాచారులు కనిపించక రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు రోడ్డుపై వాహనాలు నిలుపకుండా చూడాలని కోరుతున్నారు.

కమిటీ సేవలు అభినందనీయం

దంతాలపల్లి: పెద్దముప్పారం గ్రామ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కమిటీ చేసిన సేవలు అభినందనీయం ఎంఈఓ శ్రీదేవి అన్నారు. పెద్ద ముప్పారం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏడో వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఈఓ మాట్లాడారు. అనంతరం కమిటీ సభ్యులు గ్రామంలోని నూతన ఉపాధ్యాయులను, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి వంశీకృష్ణ, సభ్యులు, వెంకన్న, రవీంద, వెంకన్న, సుమన్, లింగరాజు, సుదర్శన్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

నెల్లికుదురు: మండలంలోని రత్తిరాంతండా శివారు కునాయికుంట తండా బీటీ రోడ్డు పనులకు నిధులు మంజూరు చేసి, తండాలో ఆగిపోయిన నరేష్, బోజ్యాలకు చెందిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మదన్ కోరారు. ఏటూరు నాగారంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీఓను శుక్రవారం కలిసి 2017 నుంచి 2021 వరకు పెండింగ్‌లో ఉన్న ఎస్టీ కార్పొరేషన్ నిధులను విడుదల చేయాలని వినతిపత్రం అందజేశారు.

రేషన్‌షాపుల తనిఖీ

మరిపెడ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో స్టేట్ టాస్క్‌ఫోర్స్ సివిల్ సప్లయ్ ఓఎస్‌డీ ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని తానంచర్ల, తాళ్లఊకల్, మరిపెడ, అబ్బాయిపాలెం గ్రామాల్లోని 7రేషన్ షాపులను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఇటీవల మరిపెడ సివిల్ సప్లయ్ గోదాం నుంచి సన్న రేషన్ బియ్యంలో జరుగుతున్న అవకతవకలు బయట పడ్డాయి. ఈ నేపథ్యంలో స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం రేషన్ షాపులు ఆకస్మిక తనిఖీ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుపై సీఎస్‌కు లేఖ

డోర్నకల్: డోర్నకల్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు అంశంపై కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ జి.శాంతకుమారికి శుక్రవారం లేఖ రాశారు. నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను కురవి మండలం అయ్యగారిపల్లిలో ఏర్పాటు కోసం శంకుస్థాపన చేయగా ఈ స్కూల్‌ను డోర్నకల్ మండలం అమ్మపాలెం గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా నాయకులు కాపరబోయిన సత్యనారాయణ కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన మంత్రి కిషన్ రెడ్డి ఈ అంశాన్ని పరిశీలించాలని కోరుతూ సీఎస్‌కు లేఖ రాశారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు అందించాలి

మరిపెడ: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందాలని సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జనవరి 26నుంచి ప్రవేశపెట్టే రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, భూమిలేని రైతు కూలీలకు కూలీ భరోసా తదితర సంక్షేమ పథకాలు గ్రామసభలో అధికారులు పారదర్శకత పాటించి అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మల్లేపాక యాకన్న, ఏఐటీయూసీ నాయకులు నారాయణ, అంజీ పాల్గొన్నారు.

సభ పోస్టర్ల ఆవిష్కరణ

నెహ్రూసెంటర్: ఈనెల 24వ తేదీన మంచిర్యాలలో జరిగే ప్రగతిశీల మహిళా సంఘం ఐక్యత సభను జయప్రదం చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఊకే పద్మ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సభల పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు.

ప్రజాధనం వృథా..

- క్రీడాప్రాంగణం, పట్టణ ప్రకృతి వనం తొలగింపు
- వాటి స్థానంలో భవనాల నిర్మాణం

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం, పట్టణ ప్రకృతి వనంలను తొలగించడంతో ప్రభుత్వ నిధులు వృథా అయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో 2021-22 పట్టణ ప్రగతి నిధులతో నాలుగు ప్రాంతాల్లో పట్టణ ప్రకృతి వనాలు, రెండు ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. వీటిలో అంబేడ్కర్‌నగర్, రైల్వేస్టేషన్, పంపుబావితండా పరిసరాల్లో రైల్వే శాఖకు చెందిన స్థలాల్లో పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేయగా అమ్మపాలెం రోడ్డులో పీహెచ్‌సీ పక్కన చెరువు శిఖం స్థలంలో ఒకటి, సెయింట్ ఆగ్నేస్ స్కూల్ ఎదురుగా మరో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. రూ.5లక్షల పట్టణ ప్రగతి నిధులతో పట్టణ ప్రకృతి వనాలను, రూ.4లక్షలతో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న పట్టణ ప్రకృతి వనాన్ని తొలగించి రైల్వే శాఖకు చెందిన భవనాల్ని నిర్మిస్తుండగా, పీహెచ్‌సీ పక్కన క్రీడా ప్రాంగణాన్ని తొలగించి అమృత్ పథకంలో భాగంలో భారీ ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన పీపీపీ, క్రీడా ప్రాంగణాలను తొలగించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే స్థలాల్లో ఏర్పాటు చేసిన మిగతా రెండు పీపీపీలను కూడా రైల్వే అధికారులు భవిష్యత్‌లో తొలగించే అవకాశాలు ఉన్నాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



రైల్వేస్టేషన్ సమీపంలో పట్టణ ప్రకృతి వనం తొలగించి నిర్మిస్తున్న భవనాలు



పీహెచ్‌సీ పక్కన క్రీడా ప్రాంగణాన్ని తొలగించి నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంక్

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో హెల్మెట్‌ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పలు రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా హెల్మెట్‌లు పంపిణీ చేశారు. డీటీఓ జయపాల్‌రెడ్డి, మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సిరికొండ విక్రమ్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. హెల్మెట్ ధరించని కారణంగానే ప్రాణనష్టం అధికంగా జరుగుతోందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కార్యక్రమంలో దాతలు, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, మేకల కుమార్, దేవరకొండ శ్రీనివాస్, వన్నాల సాగర్, చింతల రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు కాసోజు సాయినాథ్, పయ్యావుల ప్రవీణ్ పాల్గొన్నారు.

పాలేరు వాగుకు నీళ్లు వచ్చేలా కృషి

దంతాలపల్లి: మండలంలో ఉన్న పాలేరు వాగులోకి నీళ్లు వచ్చేలా ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ దృష్టికి తీసుకెళ్లాలా కృషి చేస్తామని కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. శుక్రవారం తొర్రూరు మండలం మాటేడు నండి, మండల చివారు దొనకొండ గ్రామం వరకు పాలేరు వాగును పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలేరు వాగుపై ఆధారపడి మండలంలోని వేలాది మంది రైతులు సాగు చేస్తున్నారన్నారు. వాగులో నీళ్లు పూర్తిగా తగ్గాయని, నీళ్లు రాకపోతే పంటల సాగు కష్టం అవుతుందన్నారు. కార్యక్రమంలో తొర్రూరు మార్కెట్ వైస్ చైర్మన్ బట్టునాయక్, ఆవుల సురేష్, సంపెట సురేష్, జానిపాషా, యాకన్న, సైదులు, లింగయ్య, పర్శయ్య, రామనర్సు, ప్రవీణ్, ప్రసన్న, మున్నా, రేవంత్, విష్ణు, ఆదిరెడ్డి పాల్గొన్నారు.



చెక్‌డ్యాం పరిశీలిస్తున్న నాయకులు

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



అరెస్ట్‌ను చూపిస్తున్న అధికారులు

గార్ల: మండలంలోని బుద్దారం, అంజనాపురం గ్రామాల్లో జిల్లా ఎక్సైజ్ శాఖ, గార్ల పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి, 500లీటర్ల బెల్లంపానకం, 35లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి బి.కిరణ్ శుక్రవారం వెల్లడించారు. మండలంలోని బుద్దారం తండాకు చెందిన గుగులోత్ కమిలీ, భూక్యా నాగలక్ష్మి, అంజనాపురం గ్రామానికి చెందిన ఇస్లావత్ మూన్యా, భూక్యా బుజ్జి, ధరావత్ అచ్చమ్మ, బానోత్ జ్యోతిల ఇళ్లపై దాడులు నిర్వహించి వీరి నుంచి బెల్లంపానకం, కాపుసారాను స్వాధీనం చేసుకొని అక్కడే ధ్వంసం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఏడుగురిపై కేసులు నమోదు చేసి, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ చిరంజీవి, సీహెచ్ నాగేశ్వరరావు, సీహెచ్ నీరజ, ఎస్సైలు ఎస్‌కె రియాజ్‌పాషా, అశోక్, చంద్రశేఖర్, కిరీటి, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



మహబూబాబాద్ రూరల్: ఆందోళన చేస్తున్న కార్మికులు

మహబూబాబాద్ రూరల్: రైల్వే ఇంజినీరింగ్ కార్మికులకు రెండు షిఫ్టుల పని విధానం అమలు చేయాలని మజ్దూర్ యూనియన్ వరంగల్ బ్రాంచ్ సెక్రెటరీ యుగంధర్ యాదవ్ డిమాండ్ చేశాడు. ఇంజినీరింగ్ సమస్యల పరిష్కారం కోసం మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో పెండింగ్ సమస్యలు పరిష్కారం చేయాలని, ట్రాక్ మెన్లపై పనిభారం తగ్గించాలని మహబూబాబాద్ రైల్వే సెక్షన్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ సెక్రెటరీ బాబురావు, వైస్ చైర్మన్ భాస్కర్ రావు, యూత్ ప్రెసిడెంట్ బుర్రి రమేశ్‌పాల్గొన్నారు.

డోర్నకల్: రైల్వే ఇంజనీరింగ్ కార్మికులకు రెండు షిఫ్టుల విధానం అమలు చేయాలని మజ్దూర్ యూనియన్ డోర్నకల్ బ్రాంచ్ సెక్రెటరీ అంజయ్య డిమాండ్ చేశాడు. శుక్రవారం మజ్దూర్ యూనియన్ డోర్నకల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో డోర్నకల్ సెక్షన్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ చరణ్‌నాయక్, అసిస్టెంట్ సెక్రెటరీలు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ యాత్రను విజయవంతం చేయాలి

మహబూబాబాద్: ఈనెల 19న జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ యాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ ధరంసోత్ నారాయణ్ సింగ్ పిలుపునిచ్చారు. స్థానిక అమరవీరుల స్థూపం వద్ద ఉద్యమకారుల సమావేశం నిర్వహించి అనంతరం స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా నారాయణ్ సింగ్ మాట్లాడుతూ.. ఉద్యమకారుల హక్కుల సాధన కోసం యాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఉద్యమకారుడికి 250గజాల ఇంటిస్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారులు శంతన్ రామరాజు, గుగులోత్‌రాములు, వీరస్వామి, హన్మంతు, రమేశ్, లింగన్న, రాము, వీరు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణ్ సింగ్

కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి

నెల్లికుదురు: తెగిపోయిన ఎస్సారెస్పీ కాల్వకు మరమ్మతులు చేపట్టి పంటల సాగుకు నీరందించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారుల నిర్లక్ష్యంతో మండలంలోని వివిధ గ్రామాల్లోని కెనాల్ కాల్వల్లో, మోరీల్లో చెత్తాచెదారంతో కాల్వలు తెగిపోయినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే మరమ్మతు చేపట్టి చర్య తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో నాయకులు గుగులోతు బిక్కు నాయక్, బీముడు, తదితరులు పాల్గొన్నారు.

21నుంచి వార్డు సభలు

మహబూబాబాద్: పట్టణంలో రైతుభరోసా, ఇందిరమ్మ రైతు ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఈనెల 21నుంచి 24వ తేదీ వరకు వార్డు సభలను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నోముల రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీన 1,2,14,19,21 వార్డుల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వార్డు సభ ఉంటుందన్నారు. 3,13,15,22,28 వార్డుల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు, 22వ తేదీన 4,9,16,23,33 వార్డుల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, 5,10,24,30,36 వార్డుల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందన్నారు. ఈనెల 23న 6,11,17,25,34 వార్డుల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు 7,12,18,26,35 వార్డుల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వార్డు సభ ఉంటుందని తెలిపారు. ఈనెల 24న 8,27,29 వార్డుల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, 20,31,32 వార్డుల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వార్డు సభ ఉంటుందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

బయ్యారం: ప్రయాణంను వాహనదారులు ప్రమాదకరంగా మార్చుకోవద్దని ఎస్సై తిరుపతి సూచించారు. బయ్యారంలో శుక్రవారం ఆయన వాహనదారులకు రోడ్డుప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనల ప్రకారం వాహనాలను నడిపితే ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు.

సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పాలి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: భవిష్యత్ తరాలకు మన సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి ఆదేశాల మేరకు మహబూబాబాద్ పట్టణంలోని యశోద గార్డెన్‌లో కళాకారులను ప్రోత్సహించే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. చిన్నజీయర్ స్వామి ఈనెల 30వ తేదీన ముడుపుగల్ గ్రామంలో శ్రీవెంకటేశ్వర స్వామివారి దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వికాస తరంగిణి జిల్లా చైర్మన్ ఓం నారాయణ లోయ, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ మదన్ గోపాల్ లోయ పాల్గొన్నారు.

ఆధునిక సాగు పద్ధతులపై వివరించాలి

రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై వివరిస్తూ అధిక దిగుబడులు, లాభాలు సాధించేలా శాస్త్రవేత్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మండలంలోని మల్యాల గ్రామంలో గల కృషి విజ్ఞాన కేంద్రం, జేవీఆర్ ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని ఎమ్మెల్యే శుక్రవారం సందర్శించారు. కార్యక్రమంలో ఉద్యాన పరిశోధన శాస్త్రవేత్తలు నాగరాజు, ప్రశాంత్, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాలతి, శాస్త్రవేత్తలు కిశోర్ కుమార్, రాంబాబు, క్రాంతికుమార్, రైతులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

విలీన గ్రామాల అభివృద్ధికి కృషి

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాన్నాని ఎమ్మెల్యే మురళీ నాయక్ అన్నారు. మున్సిపలిటీ పరిధిలో ఈదులపూసపల్లి ఒకటో వార్డులో సీసీరోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం వార్డు ప్రజలు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ వెన్నం లక్ష్మారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

గుడుంబా నియంత్రణకు చర్యలు

- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు

తొర్రూరు: గుడుంబా నియంత్రణకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామని ఎక్సైజ్ శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ జి.అంజన్‌రావు తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రవీణ్‌తో కలిసి గుడుంబా నిర్మూలన కోసం ఫిబ్రవరి 15 వరకు చేపట్టే ప్రత్యేక డ్రైవ్ వివరాలు వెల్లడించారు. ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలను సమన్వయం చేసుకుని ప్రత్యేక బృందాలతో గుడుంబా ప్రభావిత ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న అంజన్‌రావు

తొర్రూరు డివిజన్‌లో ఏడాది కాలంలో 495 మందిపై కేసులు నమోదయ్యాయని, 33 టన్నుల బెల్లం, 107 వాహనాలు సీజ్ చేశామని, 283 మందిని బైండోవర్ చేశామన్నారు. ఈ సమావేశంలో ఎస్సైలు రవళిరెడ్డి, శంకర్, తిరుపతి, మధు పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం

కేసముద్రం: నిప్పంటుకుని మూడు గడ్డివాములు దగ్ధమైన సంఘటన మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కత్తుల కుమారస్వామి అనే రైతుకు చెందిన 5ఎకరాల గడ్డి, లింగయ్యకు చెందిన 2ఎకరాల గడ్డిని, బండి మంజులకు చెందిన ఎకరంన్నర గడ్డిని వారి ఇళ్ల సమీపంలో ఒకే చోట కుప్పగా ఉంచారు. ఈక్రమంలో గడ్డివాముకు నిప్పంటుకుని, మంటలు వ్యాపిస్తుండడంతో గమనించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఇంతలో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పారు. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. కాగా గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివామికి నిప్పంటించారని బాధితులు ఆరోపిస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

శతాధిక వృద్ధురాలి మృతి



జయలక్ష్మి (ఫైల్)

గార్ల: గార్లలోని రాతి స్తంభం బజారుకు చెందిన సీపా జయలక్ష్మి (105) శతాధిక వృద్ధురాలు శుక్రవారం తన స్వగృహంలో మృతిచెందింది. మృతురాలికి నలుగురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు సంతానం. మృతురాలు గత 15 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది.

క్రీడలతో మానసికోల్లాసం

పెద్దవంగర: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎస్సై క్రాంతి కిరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్యాల గ్రామంలో శ్రీగోమాత మిత్ర మండలి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ఎస్సై ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రావుల వెంకట్‌రెడ్డి, గుంటుక వెంకన్న, రాపోలు సామ్రాట్ పాల్గొన్నారు.

ప్రజలు ఐకమత్యంతో మెలగాలి

మరిపెడ రూరల్: గ్రామాల్లోని ప్రజలు కుల, మతాలకు అతీతంగా ఐకమత్యంతో మెలగాలని మరిపెడ ఎస్సై బొలగాని సతీష్ అన్నారు. మరిపెడ మండలం నీలికుర్తి గ్రామ ప్రజలకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అదనపు ఎస్సై సంతోష్, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

కొత్తగూడ: గుండెపోటు వచ్చిన వ్యక్తి ప్రాణాలను సీపీఆర్ విధానంలో కాపాడవచ్చని గంగారం వైద్యాధికారి ప్రత్యూష అన్నారు. మండలంలోని చెరువుముందుతండాలో గిరిజనులకు శుక్రవారం సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు.

జయప్రదం చేయండి

కేసముద్రం: జిల్లా కేంద్రంలో ఈనెల 25న జరిగే సీపీఐ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, సహాయ కార్యదర్శి మంద భాస్కర్, వెంకన్న, నారాయణ, వెంకటయ్య, చక్రు పాల్గొన్నారు.

విలీన సభను విజయవంతం చేయండి

కొత్తగూడ: ఈనెల 19న జిల్లా కేంద్రంలో జరిగే ఏఐకేఎంఎస్, అఖిల భారత రైతు కూలి సంఘాల విలీన సభను విజయవంతం చేయాలని ఏఐకెఎంఎస్ జిల్లా నాయకుడు బూర్క వెంకటయ్య కోరారు. శుక్రవారం మండలంలోని ముస్మి, లడాయిగడ్డ గ్రామాల్లో విలీన సభపై ప్రచారం నిర్వహించారు.

ఉద్యమకారుల మండల ఫోరం కమిటీ ఎన్నిక

నెల్లికుదురు: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ఫోరం అధ్యక్షుడు ముద్దసాని వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షుడు అన్నపురం వెంకన్న శుక్రవారం తెలిపారు. ఫోరం మండల అధ్యక్షుడిగా కుమ్మరికుంట్ల మానేందర్, ప్రధాన కార్యదర్శిగా కసరబోయిన విజయ్ యాదవ్, ముఖ్య సలహాదారులుగా మద్ది వెంకన్న, జిలుకర యాలాద్రిలను ఎన్నిక చేసినట్లు తెలిపారు.

గుట్టలను సర్వే చేసిన అధికారులు



కురవి: రైతు భరోసా కోసం సాగుకు యోగ్యం అయ్యే భూములు ఎన్ని, గుట్టలు, రియల్ ఎస్టేట్ భూములను శుక్రవారం రెండో రోజు సీరోలు తహసీల్దార్ శారద నేతృత్వంలో చింతపల్లి, కొత్తూరు(సీ) గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఆర్ఐ మహబూబ్‌పాషా, ఏఈఓ సురేష్ పాల్గొన్నారు. అలాగే కురవి మండలంలో స్పెషల్ అధికారి నరసింహరావు, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఏఓ నరసింహారావు, ఏఈఓ విజేందర్ పాల్గొన్నారు.

బయ్యారం పెద్దచెరువు అలుగుల ఎత్తు పెంచాలి

బయ్యారం: కాకతీయుల కాలంలో నిర్మించిన బయ్యారం పెద్దచెరువు అలుగులు మూడు అడుగుల మేర ఎత్తు పెంచాలని రాష్ట్ర ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబును మండల కాంగ్రెస్ నాయకులు కోరారు. ఇల్లందులో శుక్రవారం ఎమ్మెల్యే కనకయ్య అధ్యక్షతన నీటిపారుదల శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు ముసలయ్య, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అయోడిన్‌పై అవగాహన

నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం చిన్ననాగారం ఎస్సీ కాలనీలో శుక్రవారం ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఐటీసీ వారి సహకారంతో అయోడిన్ లోపం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్, ఓఆర్‌డబ్ల్యూ కవిత, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గార్ల: మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన ఈసారపు విజయ్ కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూపు సభ్యులు మృతుడి కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

ఎంపీకి వినతి

చిన్నగూడూరు: మండలంలోని ఆకేరువాగు పైన నూతన ఆనకట్ట నిర్మాణానికి కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు డీఎస్ వెంకన్న నాయక్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీ పోరిక బలరాంనాయక్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

సహాయ కార్యదర్శిగా అనిల్

నెల్లికుదురు: పీవైఎల్ జిల్లా కమిటీ సహాయ కార్యదర్శిగా ఇరుగు అనిల్‌ను ఎన్నుకున్నారు. మండలంలోని బంజర గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పీవైఎల్ విలీనం సమావేశంలో ఏకగ్రీవంగా అనిల్ ఎన్నుకున్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కురవి: ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ నేడు(శనివారం) కురవి, సీరోలు మండలాల్లో పర్యటించి వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి

పెద్దవంగర: ప్రతీ ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలని దాత సుంకరి శ్రీనివాస్ చైతన్య దంపతులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నూతన వాటర్ ప్లాంట్ నిర్మాణం సొంత ఖర్చులతో బోర్ వేయించారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

తొర్రూరు రూరల్: మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మండలంలోని గుడిబండ తండా పంచాయతీ పరిధిలో ఇటీవల ముగ్గులు, క్రికెట్ పోటీలు నిర్వహించారు. శుక్రవారం విజేతలకు ఝాన్సీరెడ్డి బహుమతులు అందించారు.

అమరుల స్ఫూర్తితో ఉద్యమాలు

కురవి: అమరుల స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు ఉద్యమాలు కొనసాగించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ మండల మాజీ కార్యదర్శి సురేందర్‌కుమార్(సూరి) వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కరణం రాజన్న, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సమ్మయ్య, రమేశ్ పాల్గొన్నారు.